ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



నవంబర్ 14 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 35 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SATURDAY NOVEMBER 14 2026 | VOL:1 | ISSUE: 35 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

హైదరాబాద్‌లో 4 పీఆర్‌టీఎస్ కారిడార్లు..

ఏడాదిలోనే తొలిదశ పూర్తి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రతిపాదన

ఏడాదిలోగా తొలి దశను పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ఐటీ కారిడార్ సహా నాలుగు కీలక మార్గాల్లో నిర్మాణం

మెట్రోకు అనుబంధంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచడమే లక్ష్యం

ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం తగ్గించడంలో కీలక పాత్ర అంచనా



హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. నగరంలో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్) ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ ప్రాజెక్టుపై అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ఏడాదిలోగా తొలి దశను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం గడువు విధించారు.ప్రస్తుతం ఉన్న మెట్రో రైలు వ్యవస్థకు అనుబంధంగా, చివరి గమ్యస్థానానికి (లాస్ట్ మైల్), స్వల్ప దూర ప్రయాణాలకు ఈ పీఆర్‌టీఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. నగరంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల మధ్య సులభమైన, వేగవంతమైన రాకపోకలను సాధ్యం చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ వ్యవస్థతో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా, కాలుష్యాన్ని కూడా నియంత్రించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

(మిగతా 2వ పేజీలో..)

రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



- **నిరుద్యోగులపై దాడులు, హైడ్రా కూల్చివేతలపై రాహుల్ ఎందుకు మాట్లాడరన్న కేటీఆర్**
- **భారత్ సమ్మిట్ కోసం రూ.100 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపణ**
- **బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగినా స్పందించలేదని విమర్శ**

హైదరాబాద్‌లో జరిగే 'భారత్ సమ్మిట్ 2026'లో పాల్గొనేందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీకి పలు సూటి ప్రశ్నలు సంధిస్తూ విమర్శలు గుప్పించారు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ యువతపై కాంగ్రెస్ పోలీసులు దాడులు చేసినప్పుడు రాహుల్ ఎక్కడున్నారని కేటీఆర్ నిలదీశారు. లగచర్లలో గిరిజన మహిళలపై దాడులు జరిగినప్పుడు, హైడ్రా బుల్డోజర్లతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తుంటే రాహుల్ ఢిల్లీలో నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో వేలాది చెట్లను నరికివేయడం, 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి

(మిగతా 2వ పేజీలో..)

రోడ్ల ఆధునికీకరణపై మేధోమథనం.. హైటెక్స్ వేదికగా ఇండియన్ రోడ్ కాంగ్రెస్: కోమటిరెడ్డి



హైటెక్స్‌లో డిసెంబర్ 19 నుంచి 22 వరకు 85వ ఐఆర్‌సీ సదస్సు జరుగుతుందన్న కోమటిరెడ్డి

నాలుగు రోజుల పాటు విస్తృతంగా జరగనున్న సాంకేతిక చర్చలు జరుగుతాయని వెల్లడి

దేశవ్యాప్తంగా ఇంజినీర్లు, పరిశోధకులు, నిర్మాణ రంగ నిపుణులు హాజరవుతారన్న మంత్రి

హైదరాబాద్ వేదికగా ప్రతిష్ఠాత్మక 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) వార్షిక సదస్సు జరగనుంది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.రహదారుల నిర్మాణం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన రోడ్డు వ్యవస్థల రూపకల్పనపై విజ్ఞాన పంపిణీ, ఆలోచనల మార్పిడి, వినూత్న విధానాల అన్వేషణకు ఈ ఐఆర్‌సీ సదస్సు ఒక కీలక వేదిక కానుందని మంత్రి పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి ఇంజినీర్లు, పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, మెటీరియల్ తయారీదారులు పాల్గొని సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారని తెలిపారు. ఈ నెల 19న ఐఆర్‌సీ 238వ కౌన్సిల్ సమావేశం, 20న జాతీయ రహదారుల పరిశోధనా మండలి 90వ సమావేశం జరగనున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా రోడ్డు నెట్‌వర్క్ నాణ్యతను పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఈ సమావేశాలు దోహదపడనున్నాయి. జాతీయ స్థాయి ప్రతినిధులు ఒకేచోట చేరి విధానపరమైన అంశాలపై చర్చించనుండటంతో హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఈ సదస్సుకు ప్రాధాన్యత ఏర్పడింది.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు అమ్ముతుంటే చూస్తూ ఊరుకోం: హరీశ్ రావు హెచ్చరిక

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ధర్నా

3.15 ఎకరాల స్థలం వేలాన్ని నిరసిస్తూ స్థానికులతో కలిసి ఆందోళన

ధర్నాలో పాల్గొన్న హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నిరసనకు మద్దతు ప్రకటించిన వామపక్ష పార్టీలు



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను వేలం వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నిరసనకు సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి.కూకట్‌పల్లిలో ప్రజావసరాల కోసం కేటాయించిన 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ఈ నెల 27న ప్రభుత్వం వేలం వేసేందుకు సన్నాహాలు చేస్తుండటంతో ఈ నిరసన మొదలైంది. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందలతో కలిసి హరీశ్ రావు ట్రక్ పార్క్ స్థలాన్ని పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. భూముల వేలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని వారికి భరోసా

(మిగతా 2వ పేజీలో..)

తెలంగాణలో మరింత పడిపోనున్న ఉష్ణోగ్రతలు.. ప్రజలకు వైద్యారోగ్య శాఖ హెచ్చరిక



తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా రాబోయే రెండు రోజుల పాటు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ సమయంలో రాష్ట్రంలో ప్రధానంగా పొడి వాతావరణం ఉంటుందని స్పష్టం చేసింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రజల రక్షణ కోసం తెలంగాణ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది.ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా తగ్గడం వల్ల సీజనల్ ఫ్లూ, తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. రవీందర్ నాయక్ హెచ్చరించారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులు, 65 ఏళ్ల దాటిన వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, తీవ్ర అలసట వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేశారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముక్కు, నోటికి రుమాలు అడ్డు పెట్టుకోవాలని, చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని అధికారులు సూచించారు. అనారోగ్య లక్షణాలు ఉన్నవారు బహిరంగ ప్రదేశాలకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవచ్చని వైద్యారోగ్య శాఖ పేర్కొంది.

అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం: మంత్రి పొన్నం ప్రభాకర్

రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పబట్టిన పొన్నం ప్రభాకర్

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శ

కాంగ్రెస్‌కు హామీలు ఇవ్వడమే కాకుండా అమలు చేసే సత్తా ఉందని స్పష్టీకరణ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన ఆయన, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదంటూ ఘాటుగా బదులిచ్చారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఘన చరిత్ర గాంధీ కుటుంబానిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. "పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ అయినా ఇచ్చారా?" అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా, పకడ్బందీగా పరీక్షలు కూడా నిర్వహించిందని వివరించారు. కాంగ్రెస్‌కు హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని అమలు చేసే సత్తా కూడా ఉందని స్పష్టం చేశారు.అవినీతి గురించి కేటీఆర్

(మిగతా 2వ పేజీలో..)

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపుపై విచారణ జరపాలి: కవిత డిమాండ్

ఫామ్‌హౌస్‌కు కెనాల్ ఉందా? లేదా? అనే అంశంపై బీఆర్ఎస్ స్పష్టతనివ్వాలన్న కవిత

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని వ్యాఖ్య

సిద్ధిపేటలో టీఆర్ఎస్ కార్యాలయానికి భూమిపూజ చేసిన కవిత దంపతులు

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపుపై విచారణ జరపాలి: కవిత డిమాండ్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈరోజు సిద్దిపేట జిల్లా పర్యటనకు వచ్చిన కవిత, తన భర్తతో కలిసి పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా కెనాల్ ఉందా లేదా అనే విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్పష్టం చేయాలని కవిత ప్రశ్నించారు. మౌనంగా ఉన్నంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావని ఆమె పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు. ప్రజల తరఫున తప్పులను ఎత్తిచూపుతూ ప్రశ్నిస్తుంటే, తనపై ఎదురుదాడి చేయడం సరైంది కాదన్నారు. తన వ్యక్తిగత ఆస్తులకు సంబంధించి వస్తున్న విమర్శలపై స్పందిస్తూ కవిత తీవ్రస్థాయిలో సవాల్ విసిరారు. "నేను.. నా అఫిడవిట్‌లో చూపినదానికంటే ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా.. ప్రజలకు రాసిస్తా" అని ఆమె స్పష్టం చేశారు.

అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం: మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడటం వింతగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫార్ములా ఈ రేస్ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలకు కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నేరెళ్లలో దళితులపై దాడులు, ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేయడం, మల్లన్నసాగర్ నిర్వాసితులపై లాఠీఛార్జ్ వంటి ఘటనలు బీఆర్ఎస్ పాలన వైఫల్యాలకు నిదర్శనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై కేటీఆర్ తీవ్ర విమర్శల్ను

(మొదటి పేజీ తరువాయి)

చేర్చుకోవడం, అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి ఘటనలపై రాహుల్ ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. తెలంగాణ ప్రజల సొమ్ము దాదాపు రూ. 100 కోట్లతో ఈ ప్రచార ఆర్భాటం చేస్తున్నారని ఆరోపించారు

తెలంగాణలో గిగ్ వర్కర్ల భారీ ర్యాలీ.. హాజరుకానున్న రాహుల్ గాంధీ!

రేపు హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల భారీ ర్యాలీ

సామాజిక భద్రత, కార్మిక హక్కుల సాధన ప్రధాన డిమాండ్

నిరసన ప్రదర్శనకు హాజరుకావాలని రాహుల్ గాంధీకి ఆహ్వానం

శిల్పకళా వేదిక నుంచి హెచ్‌ఐసీసీ వరకు ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు

సామాజిక భద్రత, కార్మిక హక్కులు, సంక్షేమ చర్యలను డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు భారీ ర్యాలీకి పిలుపునిచ్చారు. రేపు ఈ మహా ప్రదర్శనను నిర్వహించనున్నట్లు 'తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్' (టీజీపీడబ్ల్యూయూ) ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు యూనియన్ ప్రతినిధి షేక్ సలావుద్దీన్ తెలిపారు.ఈ ర్యాలీ శిల్పకళా వేదిక నుంచి ప్రారంభమై 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్' (హెచ్‌ఐసీసీ)/హైటెక్స్ ప్రాంతం వరకు కొనసాగనుంది. గిగ్ కార్మికుల పక్షాన, ముఖ్యంగా 2023లో జరిగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ అందించిన మద్దతుకు యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ నేపథ్యంలోనే తమ పోరాటానికి సంఘీభావం తెలపాలని ఆయన్ను కోరినట్లు పేర్కొంది.తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ఆమోదించిన 'తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్-2026' నేపథ్యంలో ఈ ర్యాలీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ కొత్త చట్టం ద్వారా గిగ్ కార్మికులందరినీ తప్పనిసరిగా నమోదు చేసుకోవడం, వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించడం, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం వంటి అంశాలకు చట్టపరమైన హామీ లభించింది.ప్రభుత్వం ఇప్పటికే ఈ చట్టం అమలు కోసం నియమాలను రూపొందించిందని, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందని యూనియన్ తెలిపింది. అంతేకాకుండా, కార్మికుల నమోదు మరియు ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా ప్రారంభించిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో, చట్టం ద్వారా లభించిన హక్కులను పూర్తిగా, మెరుగైన పద్ధతిలో అమలు చేయాలని కోరుతూ రవాణా, డెలివరీ, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న కార్మికులు ఈ ర్యాలీ ద్వారా తమ గళాన్ని వినిపించనున్నారు.



కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు అమ్ముతుంటే చూస్తూ ఊరుకోం: హరీశ్ రావు హెచ్చరిక



ఇచ్చారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ట్రక్ పార్క్ భూములు అమ్మితే ఊరుకోం. భూములు అమ్మడమే ప్రభుత్వ పనా? ఎక్కడ భూమి కనబడినా అమ్ముడేనా? రేవంత్ రెడ్డి పాలన కాకుండా.. రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంచు భూమి కూడా అమ్మబోమని చెప్పారు. ఇప్పుడు భూములు అమ్మడమే పనిగా పెట్టుకున్నారు. కాప్రా, అమీన్‌పూర్‌లలో కూడా ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు.

గతంలో 2013లోనూ ఇదే భూమిని విక్రయించేందుకు ప్రయత్నించినప్పుడు రాజకీయ పక్షాలన్నీ ఏకమై అడ్డుకున్నాయని నేతలు పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాలను వ్యాపార ప్రయోజనాల కోసం అమ్మడం సరికాదని, ప్రభుత్వం వెంటనే ఈ వేలాన్ని విరమించుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో 4 పీఆర్‌టీఎస్ కారిడార్లు.. ఏడాదిలోనే తొలిదశ పూర్తి: సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపాదిత కారిడార్లు ఇవే..

తొలి దశలో భాగంగా అధికారులు నాలుగు కీలక కారిడార్లను ప్రతిపాదించారు. ఒకటి: ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్ స్టేషన్ వరకు. రెండు: అసెంబ్లీ మెట్రో స్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమ్యాక్స్ మీదుగా బేగంపేట వరకు. మూడు: పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ల వరకు. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే కేపీహెచ్‌బీ – మైండ్‌స్పేస్ మార్గాన్ని తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కార్యకలాపాలకు మద్దతుగా నెక్లెస్ రోడ్ మరియు గచ్చిబౌలిలోని ఐకియా సమీపంలో ప్రత్యేక డిపోలతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సముదాయాలను నిర్మించాలని కూడా ప్రతిపాదించారు. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

రేపటి నుంచే గిగ్ వర్కర్స్ పాలసీ అమలు.. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం పాలసీ

శనివారం నుంచి అమలు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

రాహుల్ గాంధీ సమక్షంలో నిబంధనలు, సంక్షేమ పథకాల ప్రకటన

లక్షలాది మంది గిగ్ వర్కర్లకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం

తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత కోసం రూపొందించిన ప్రత్యేక పాలసీని శనివారం (నవంబరు 14) నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు ఆరు లక్షల మంది గిగ్ వర్కర్లకు ఈ విధానం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన సీఎం.. గిగ్ వర్కర్ల సమక్షంలో ఈ పాలసీని ప్రకటించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని రాష్ట్రానికి ఆహ్వానించినట్లు వెల్లడించారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. శనివారం ఆయన గిగ్ వర్కర్లతో సమావేశం కానున్నారు.ఈ సందర్భంగా గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు, సంక్షేమ పథకాలను రాహుల్ గాంధీ ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది గిగ్ వర్కర్లకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం అమలుకు అవసరమైన నిబంధనలు, పథకాలను కూడా ప్రభుత్వం సిద్ధం చేసింది.



నా ఫోన్‌ను మోదీ ట్యాప్ చేస్తున్నారు.. రాహుల్ గాంధీ సంచలన ఆరోపణ

మోదీతో ముఖాముఖి చర్చకు రాహుల్ మరోసారి సవాల్

పార్లమెంటులో తన మైక్ నిలిపివేస్తున్నారన్న ప్రతిపక్ష నేత

కీలక అంశాలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శ

ఢిల్లీ కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని ఏసీ గది నుంచి బయటకు రావాలని వ్యాఖ్య

మోదీ తన విషయంలో ఆచితూచి మాట్లాడుతున్నారని వ్యాఖ్య

తన ఫోన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విదేశీ శక్తుల సాయంతో దేశంలో అరాచకం సృష్టించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు ఆయన ఈ వ్యాఖ్యలతో బదులిచ్చారు. తన ఫోన్‌లోనే ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు.ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు రావాలన్న సవాలును రాహుల్ మరోసారి పునరుద్ఘాటించారు. ఆ చర్చకు మోదీ వస్తే ఎవరు విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకి? అన్న విషయాలు బయటపడతాయని అన్నారు. చర్చ జరిగితే ప్రధాని రాజకీయ జీవితం ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు. తాను ప్రసంగాల రూపంలో సాగే చర్చను కోరుకోవడం లేదని, ఇద్దరి మధ్య నేరుగా చర్చ జరగాలని స్పష్టం చేశారు.పార్లమెంటులో చర్చకు ప్రయత్నించినా తన మైక్ నిలిపివేస్తున్నారని, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. రైతు చట్టాలు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్, చైనా తదితర అంశాలపై తనకు మాట్లాడే అవకాశం రాలేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో చర్చకు రావాలంటూ చేసిన సవాలుపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని తన ఏసీ గది నుంచి బయటకు వచ్చి సామాన్యులు పీల్చే గాలిని పీల్చాలని రాహుల్ అన్నారు. తనపై మోదీ గతంలో మాదిరిగా విమర్శలు చేయడం లేదని, ఆచితూచి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం ఆయన మనసులో ఉన్న భయమేనని రాహుల్ వ్యాఖ్యానించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేతకు నవంబర్ 15 నుంచి రిలే నిరసనలు!





- **డంపింగ్ యార్డు సమస్యపై పార్టీలకు అతీతంగా పోరాటం.. మద్దతు తెలిపిన ఎమ్మెల్యే మల్లారెడ్డి..**
- **జేఏసీ కో-కన్వీనర్‌గా మహేందర్ రెడ్డి**

జవహర్‌నగర్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని కోరుతూ నవంబర్ 15 నుంచి రిలే నిరసన దీక్షలు చేపట్టాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) నిర్ణయించింది. ఈ ఉద్యమానికి మద్దతు కోరుతూ శుక్రవారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆయన తనయుడు మహేందర్ రెడ్డికి జేఏసీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ షేక్ షావలి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలైన జవహర్‌నగర్, దమ్మాయిగూడ, కాప్రా, కీసర, శామీర్‌పేట, ఘట్‌కేసర్, యాప్రాల్, చెంగిచర్ల ప్రాంతాల ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, భూగర్భ జలాల నాణ్యతపై ఆందోళనలు, తాగునీటి సమస్యలు, దోమలు, ఈగల వ్యాప్తి వంటి సమస్యలు స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.డంపింగ్ యార్డు ప్రభావంతో డెంగ్యూ, మలేరియా, చర్మ, శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని జేఏసీ నాయకులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే చెరువులు, కుంటల నీటి నాణ్యత దెబ్బతింటోందని, దీనివల్ల రైతులు, పాడి రైతులు, మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం పడుతోందని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యలపై ప్రజలు చాలాకాలంగా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని జేఏసీ అభిప్రాయపడింది. డంపింగ్ యార్డు తరలింపుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరింది.డంపింగ్ యార్డు సమస్యను శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మల్లారెడ్డిని కోరినట్లు షావలి తెలిపారు. ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు సంబంధించిన ఈ అంశంపై పార్టీలకు అతీతంగా పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. త్వరలో ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌లను కలిసి ఉద్యమానికి మద్దతు కోరనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి అండగా ఉంటామని, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోతే రాజీనామా చేసి జేఏసీతో కలిసి ఉద్యమిస్తామని ఎమ్మెల్యే మల్లారెడ్డి హామీ ఇచ్చినట్లు కమిటీ నాయకులు తెలిపారు. అలాగే మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి జేఏసీ కో-కన్వీనర్‌గా కొనసాగేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు.నవంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే రిలే నిరసన దీక్షల్లో దమ్మాయిగూడ జేఏసీతో పాటు నాలుగు మండలాల పరిధిలోని సంబంధిత ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని షేక్ షావలి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి, ఐఎఫ్‌టీయూ నాయకుడు శివబాబు, కో-కన్వీనర్లు ఆలూరి రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, టీయూసీఐ వి. ప్రవీణ్, పీకేఎం డి. జాన్, ఏఐఎఫ్‌టీయూ వై. మల్లేష్, సీఎంఎస్ జయ తదితరులు పాల్గొన్నారు.

B.J.R. నగర్‌లో అధ్వానంగా ప్రధాన రహదారి..!

- **భారీ టిప్పర్ లారీలతో ధ్వంసమైన రోడ్లు.. అనధికార కేబుల్ తవ్వకాలతో అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ!**
- **రోడ్లపై మురుగునీరు, దుమ్ము, దుర్వాసనతో ప్రజల అవస్థలు -- ప్రమాదాల ముప్పు.. అధికారుల తక్షణ జోక్యానికి స్థానికుల విజ్ఞప్తి**

జవహర్ నగర్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీ.జీ.=. నగర్ ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు భారీ టిప్పర్ లారీల రాకపోకలు, మరోవైపు అనుమతులు లేకుండా చేపడుతున్న కేబుల్ తవ్వకాలతో రహదారి పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మురుగునీరు రోడ్లపై నిరంతరం ప్రవహిస్తుండటంతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది.స్థానికుల కథనం ప్రకారం.. కొందరు ప్రైవేటు కాంట్రాక్టర్లు ఎలాంటి ముందస్తు అనుమతులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండానే ప్రధాన రహదారిని తవ్వి కేబుల్ లైన్లు వేస్తున్నారు. ఈ క్రమంలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో మురుగునీరు రహదారులపైకి చేరుతోంది. ఫలితంగా పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యల భయంతో ఆందోళన చెందుతున్నారు.మరోవైపు, అధిక లోడుతో భారీ టిప్పర్ లారీలు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గుంతలతో నిండిన రహదారిపై ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతుండగా, పాదచారులు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటం ప్రమాద భయాన్ని మరింత పెంచుతోంది.రోడ్లపై మురుగునీరు, దుమ్ము, ధూళి కలిసి పరిసర ప్రాంతాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత, ఆరోగ్యం కంటే కాంట్రాక్టర్ల పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో B.J.R. నగర్ ప్రధాన రహదారిపై అనుమతులు లేని భారీ టిప్పర్ లారీల రాకపోకలను నిలిపివేయాలని, అవసరమైన చోట నో ఎంట్రీ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అనధికార కేబుల్ తవ్వకాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు దెబ్బతిన్న డ్రైనేజీ, నీటి పైపులైన్లను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని, మురుగునీటి సమస్యను పరిష్కరించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే మేల్కొని చర్యలు తీసుకోవాలని బీ.జీ.=. నగర్ వాసులు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తారా? లేక ప్రజల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.

ముల్కనూర్‌లో ఘనంగా నాగుల చవితి వేడుకలు!

భీమదేవరపల్లి, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో నాగుల చవితి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సమ్మక్క గద్దెల సమీపంలో కొలువై ఉన్న శ్రీ నాగేశ్వరీ ఆలయం భక్తుల సందడితో కిటకిటలాడింది.నాగుల చవితిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే ముల్కనూర్‌తో పాటు పరిసర గ్రామాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని నాగుపుట్ట వద్ద పాలు పోసి, కొబ్బరికాయలు సమర్పించి, పసుపు, కుంకుమలు, పూలు, నైవేద్యాలతో నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని నాగదేవతను భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంతో పూజలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, భక్తుల రాకతో శ్రీ నాగేశ్వరీ ఆలయం సందడిగా మారింది. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను భక్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు.



లక్ష ఎకరాల్లో పంటల మార్పిడికి సన్నాహాలు!

- **రైతులకు మేలు చేసే పంటల సాగుపై జిల్లా యంత్రాంగం దృష్టి**
- **పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ వచ్చే పంటలపై అవగాహన**
- **విజయవంతమైన రైతుల అనుభవాలతో ప్రత్యేక యూట్యూబ్ ఛానల్**

సూర్యాపేట, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా, భూమికి అనువైన ఇతర పంటలను కూడా సాగు చేసేలా ప్రోత్సహించేందుకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. వచ్చే యాసంగి (2026--27) సీజన్‌లో జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటల మార్పిడి చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. రైతులకు ఏ పంట వేస్తే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి, మెరుగైన ఆదాయం వస్తుందనే విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఏ ప్రాంతంలో ఏ పంట బాగా పండుతుంది, నీటి సౌకర్యం ఎలా ఉంది, సాగుకు ఎంత ఖర్చవుతుంది, పండిన పంటకు మార్కెట్‌లో గిరాకీ ఉందా అనే విషయాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో సాగుకు అనువైన పంటలను గుర్తించి ప్రణాళికలు రూపొందించనున్నారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు కలిసి పనిచేస్తూ రైతులకు అందుబాటులో ఉన్న సాగునీటి, సూక్ష్మ సేద్య పథకాల ప్రయోజనాలను వివరించనున్నారు. ఏ పంటకు ఎంత పెట్టుబడి పెట్టాలి? ఎన్ని రోజుల్లో పంట చేతికి వస్తుంది? ఎంత దిగుబడి, ఆదాయం పొందవచ్చు? అనే వివరాలతో పంటల జాబితా తయారుచేసి రైతులకు పుస్తక రూపంలో అందించనున్నారు.

రైతుల వద్దకే వెళ్లి వివరించాలి

పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటించాలని కలెక్టర్ సూచించారు. కేవలం సమావేశాలు పెట్టడం, వాట్సాప్‌లో సందేశాలు పంపడంతో సరిపెట్టకుండా రైతులను నేరుగా కలిసి మాట్లాడాలని తెలిపారు. గతంలో సూచించినట్లుగా ప్రతి అధికారి కనీసం పది మంది రైతులను కలిసి కొత్త పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని పేర్కొన్నారు.నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచారం నిర్వహించి పంటల మార్పిడిపై రైతుల్లో ఆసక్తి పెంచనున్నారు. ఇందుకోసం వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. పత్రికలు, టీవీలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కూడా రైతులకు సమాచారం అందించనున్నారు.

విజయవంతమైన రైతుల కథలతో ప్రత్యేక ఛానల్

ఇప్పటికే కొత్త పంటలు సాగుచేసి మంచి లాభాలు పొందుతున్న రైతుల అనుభవాలను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్ నుంచి ఇద్దరు నుంచి ఐదుగురు విజయవంతమైన రైతులను గుర్తించి, వారు ఏ పంట వేశారు? ఎంత ఖర్చు చేశారు? ఎంత దిగుబడి వచ్చింది? ఎంత ఆదాయం పొందారు? అనే వివరాలను సేకరించనున్నారు.ఈ రైతుల అనుభవాలను వీడియోలుగా రూపొందించి ప్రత్యేక యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇతర రైతులు కూడా వాటిని చూసి కొత్త పంటల సాగుపై అవగాహన పెంచుకునేలా వాట్సాప్ ద్వారా ప్రచారం చేయనున్నారు. ఇందుకోసం



సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసి మూడు, నాలుగు రోజుల్లో ఛానల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థుల యూనిఫామ్‌ల పంపిణీపై సమీక్ష

వ్యవసాయ అంశాలతో పాటు జిల్లాలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపైనా సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లు, ఇంటర్మీడియట్, కళాశాలలు, పాలిటెక్నిక్, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే అంశాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనున్నారు. వచ్చే మంగళవారం ఇందుకు సంబంధించిన సమావేశం జరగనుంది.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల విషయంలో కొలతలు సరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. చిన్న పిల్లలకు పెద్ద సైజు, పెద్ద పిల్లలకు చిన్న సైజు దుస్తులు ఇవ్వడం వల్ల ఇబ్బందులు వస్తాయని, ఈ సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. యూనిఫామ్‌ల కుట్టు, సరఫరా, పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు కలిసి పరిష్కరించాలని సూచించారు.గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను కూడా పరిశీలించనున్నారు. ప్రతి శాఖ అధికారి వారానికి ఒకసారి తమ పరిధిలోని పనులను సమీక్షించి, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

పశుసంవర్ధక శాఖపైనా దృష్టి

పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పనులపై కూడా సమావేశంలో చర్చించారు. జంతువుల సంరక్షణ కేంద్రానికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజు, డీఆర్డీఓ సన్యాసయ్య, సీపీఓ దామోదర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి యాదగిరి, డీఐఈఓ సులోచన రాణి, డీబీసీడీఓ విశాల్, డీఎస్సీడీఓ లత, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్, ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, జీఎం ఇండస్ట్రీస్ భారతి తదితరులు పాల్గొన్నారు.

మల్లారంలో పారిశుద్ధ్య సమస్య.. పట్టించుకునేదెవరు?

భీమదేవరపల్లి, ప్రజానేస్తం జ్వాల:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై గ్రామ పంచాయతీ అధికారులు మరింత దృష్టి సారించాలని కోరుతున్నారు.గత బుధవారం సాయంత్రం గ్రామంలో వార సంత నిర్వహించారు. సంత ముగిసిన తర్వాత కూరగాయల వ్యర్థాలు, ఇతర చెత్తను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో రహదారులపై చెత్త పేరుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? వారికి కేటాయించిన పనులు సక్రమంగా జరుగుతున్నాయా? అనే అంశాలపై పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడుతున్నారు. కొందరు కార్మికులతో పారిశుద్ధ్య పనులకు బదులుగా ఇతర పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను పరిశీలించాల్సి ఉంది.ముఖ్యంగా బస్టాండ్ ఆవరణలో చెత్త పేరుకుపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.గ్రామంలోని సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, చెత్త తొలగింపుతో పాటు కార్మికుల విధుల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.



భీమదేవరపల్లిలో అగ్నిప్రమాదం.. 300 గడ్డి కట్టలు దగ్ధం

భీమదేవరపల్లి, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో రైతుకు చెందిన సుమారు 300 గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. దీంతో పశువుల మేత కోసం ముందుగా నిల్వ చేసుకున్న గడ్డి మొత్తం కాలిపోవడంతో రైతు ఇబ్బందుల్లో పడ్డారు.వివరాల్లోకి వెళితే.. భీమదేవరపల్లి గ్రామానికి చెందిన రైతు బండి రాజయ్య తన పశువుల మేత అవసరాల కోసం సుమారు 300 గడ్డి కట్టలను నిల్వ చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గడ్డి కట్టలకు మంటలు అంటుకోవడంతో కొద్దిసేపటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి.అప్రమత్తమైన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే గడ్డి కట్టలన్నీ పూర్తిగా కాలిపోయాయి. పశువులకు అవసరమైన మేతను ముందుగానే సమకూర్చి పెట్టుకున్నప్పటికీ, అగ్నిప్రమాదంతో అది మొత్తం బూడిద కావడంతో రాజయ్యకు ఆర్థికంగా నష్టం కలిగింది. ఇప్పుడు పశువులకు మేత ఎలా సమకూర్చుకోవాలోనని ఆయన ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.




ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సజ్జనార్‌పై మాజీ ఐపీఎస్ నాగేశ్వరరావు తీవ్ర వ్యాఖ్యలు!

హైదరాబాద్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను ప్రభుత్వం మరో పోస్టుకు బదిలీ చేయడంపై మాజీ ఐపీఎస్ అధికారి ఎం. నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. సజ్జనార్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా చేసిన పోస్ట్ పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సజ్జనార్‌ను హైదరాబాద్ సీపీ పదవి నుంచి బదిలీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌కు నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. తన మాజీ సహోద్యోగిని 'పోలీసు యూనిఫాంలో ఉన్న నేరస్థుడు' అని విమర్శించాల్సి రావడం బాధ కలిగిస్తోందని పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత స్నేహబంధం కంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.కేవలం బదిలీ చేయడం వల్ల తన దృష్టికి వచ్చిన ఆరోపణలు తొలగిపోవని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. సజ్జనార్‌పై తాను గతంలో ప్రస్తావించిన ఆరోపణలన్నింటిపైనా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.మాజీ సహోద్యోగిపై ఇంతటి తీవ్ర వ్యాఖ్యలు చేయడం, బదిలీ నేపథ్యంలోనే విచారణకు డిమాండ్ చేయడం ప్రస్తుతం చర్చకు దారితీసింది. అయితే నాగేశ్వరరావు చేసిన ఆరోపణలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ అంశంపై ప్రభుత్వం లేదా సజ్జనార్ నుంచి అధికారిక స్పందన వెలువడితేనే మరింత స్పష్టత రానుంది.



నిషానీ గ్రామంలో ఘనంగా దండారి ఉత్సవాల ముగింపు!

కెరమెరి, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని నిషానీ గ్రామంలో వారం రోజుల పాటు సంప్రదాయబద్ధంగా సాగిన దండారి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు అత్యంత పవిత్రంగా భావించే ఈ ఉత్సవాలను ఏటా ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఉత్సవాల ముగింపు సందర్భంగా నిషానీ గ్రామంలో కొలబోడింగ్ కార్యక్రమాన్ని ఆదివాసీ ఆచార వ్యవహారాల ప్రకారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గుస్సాడీ నృత్యాలు, సంప్రదాయ వాయిద్యాల మోత, ప్రత్యేక వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గిరిజన కళాకారుల నృత్యాలు, ప్రదర్శనలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.దండారి ఉత్సవాలు కేవలం పండుగ వేడుకలకే పరిమితం కాకుండా ఆదివాసీ జీవన విధానం, సామాజిక ఐక్యత, ఆచార సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయి. పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో గిరిజనులు ఈ ఉత్సవాలను తరతరాలుగా కొనసాగిస్తున్నారు.ఏడు రోజుల పాటు నిషానీ గ్రామంలో పండుగ సందడి నెలకొనగా, కొలబోడింగ్ కార్యక్రమంతో ఉత్సవాలకు సంప్రదాయబద్ధంగా ముగింపు పలికారు. ఆదివాసీ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పిన ఈ వేడుకలు గ్రామస్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

ఉన్నత విద్యపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

కీతవారిగూడెం, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉన్నత విద్యలో సరైన కోర్సులను ఎంచుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులు సూచించారు. గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన బీఎస్సీ వ్యవసాయ శాస్త్రం చివరి సంవత్సరం విద్యార్థినులు కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించారు.పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎంచుకోగల వివిధ కోర్సులు, విద్యా మార్గాలు, ఉద్యోగ అవకాశాలను వివరించారు. వ్యవసాయం, వైద్యం, ఇంజినీరింగ్, నర్సింగ్, ఉపాధ్యాయ విద్య తదితర రంగాల్లో ఉన్నత విద్య అభ్యసించడం ద్వారా లభించే అవకాశాలను తెలియజేశారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచి, సామర్థ్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంచుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, ఇతర కారణాలతో విద్యార్థులు మధ్యలోనే చదువు మానివేయకుండా ప్రోత్సహించడం అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. చిన్న వయస్సు నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదవాలని విద్యార్థులకు సూచించారు.విద్య ఉద్యోగం పొందడానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి కూడా దోహదపడుతుందని వివరించారు. ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, పాఠశాల ఇన్‌చార్జి ఏ. వెంకట ప్రసాద్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థుల్లో ఉన్నత విద్య పట్ల ఆసక్తి పెంపొందించడం, మధ్యలో చదువు మానివేసే పరిస్థితులను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



మధుమేహ ముప్పు.. 108కు రెండున్నరేళ్లలో 18 వేల అత్యవసర కాల్స్!

- **చక్కెర స్థాయిలు పడిపోవడంతోనే అత్యధిక కేసులు.. 13,219 మందికి అత్యవసర వైద్య సేవలు**
- **45--75 ఏళ్ల వయసు వారిలోనే 68 శాతం కేసులు.. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా 108--EMRI గణాంకాల వెల్లడి**

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):

మధుమేహం.. ఒకసారి వచ్చిందంటే జీవితాంతం అప్రమత్తంగా ఉండాల్సిన వ్యాధి. మందులు వాడటంలో నిర్లక్ష్యం, సమయానికి భోజనం చేయకపోవడం, జీవనశైలిలో మార్పులు వంటి కారణాలతో రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోయినా, విపరీతంగా పెరిగినా ప్రాణాపాయ పరిస్థితులు ఎదురుకావచ్చు. తెలంగాణలో నమోదవుతున్న మధుమేహ అత్యవసర కేసులు ఈ ప్రమాద తీవ్రతను చాటుతున్నాయి. గత రెండున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 18,054 మందికి 108 అంబులెన్స్ సేవలు అందించడం పరిస్థితికి అద్దం పడుతోంది.నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా తెలంగాణ 108--జువీ=× గ్రీన్ హెల్త్ సర్వీసెస్ వెల్లడించిన గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు మధుమేహ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో 18,054 మందికి వైద్య సహాయం అందించారు. 2024లో 5,759 మంది, 2025లో 6,556 మంది, 2026 సెప్టెంబర్ వరకు 5,739 మంది 108 సేవలను వినియోగించుకున్నారు.

చక్కెర తగ్గడమే పెద్ద ముప్పు..

ఈ గణాంకాల్లో అత్యంత కీలకమైన అంశం రక్తంలో చక్కెర స్థాయిలు ప్రమాదకరంగా పడిపోవడం. మొత్తం కేసుల్లో 13,219 మంది హైపోగ్లైసీమియా (చక్కెర స్థాయిలు తగ్గిపోవడం) కారణంగా అత్యవసర వైద్య సేవలు పొందారు. మరో 4,835 మంది హైపర్‌గ్లైసీమియా (చక్కెర స్థాయిలు అధికం కావడం) సమస్యతో ఆసుపత్రులకు తరలించబడ్డారు. చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడం వల్ల స్పృహ కోల్పోవడం, ఫిట్స్ వంటి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో వెంటనే వైద్య సహాయం అందించడం అత్యంత అవసరం.

45 నుంచి 75 ఏళ్ల వారిలోనే అధిక కేసులు

వయసుల వారీగా పరిశీలిస్తే 55--60 ఏళ్ల మధ్య 2,665 కేసులు నమోదై అత్యధికంగా ఉన్నాయి. 60--65 ఏళ్ల మధ్య 2,398, 65--70 ఏళ్ల మధ్య 2,304 కేసులు నమోదయ్యాయి. 45 నుంచి 75 ఏళ్ల మధ్య వయసున్న వారిలోనే 12,317 కేసులు ఉండటం గమనార్హం. ఇది మొత్తం కేసుల్లో 68.22 శాతం. 60 ఏళ్లు పైబడిన వారు ప్రతి నాలుగు కేసుల్లో ఒకరిగా ఉన్నారు. లింగాల వారీగా పురుషులు 53 శాతం, మహిళలు 47 శాతంగా ఉన్నారు.

పట్టణ ప్రాంతాల్లోనే మూడు వంతుల కేసులు

జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 2,252 కేసులు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లాలో 346, మెదక్ జిల్లాలో 442 కేసులు నమోదయ్యాయి. 33 నెలల కాలంలో ఒక్కో జిల్లాలో సగటున సుమారు 550 అత్యవసర కేసులు నమోదయ్యాయి. మొత్తం బాధితుల్లో దాదాపు 75 శాతం మంది పట్టణ ప్రాంతాలకు చెందినవారే కావడం గమనార్హం.

మందుల వాడకంలో నిర్లక్ష్యం వద్దు

మధుమేహ మందులు లేదా ఇన్సులిన్‌ను సూచించిన మోతాదు కంటే ఎక్కువగా తీసుకోవడం, సమయానికి భోజనం చేయకపోవడం, ఆహారం తీసుకోకుండా ఎక్కువ శారీరక శ్రమ చేయడం, మద్యం సేవించడం వంటి కారణాలతో రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోవచ్చు. మరోవైపు మందులు లేదా ఇన్సులిన్ మోతాదులు మానేయడం, అధిక కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, ఇన్ఫెక్షన్లు, అనారోగ్యం, మానసిక ఒత్తిడి కారణంగా చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల వైద్యుల సూచనల మేరకు మందులు వాడటం, భోజన సమయాలు పాటించడం, చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం అవసరం.

అత్యవసరంలో 108.. ప్రాణరక్షణకు ముందడుగు

మధుమేహ బాధితులకు అకస్మాత్తుగా తల తిరగడం, తీవ్రమైన బలహీనత, గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే 108కు ఫోన్ చేయాలి. అంబులెన్స్‌లోని శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఈఎంటీలు) గ్లూకోమీటర్‌తో రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించి, ఇతర ఆరోగ్య సూచికలను పరిశీలిస్తారు. అత్యవసర స్పందన కేంద్రంలోని వైద్యుల సూచనల మేరకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందిస్తూ సమీప ఆసుపత్రికి తరలిస్తారు. చక్కెర స్థాయిలు తీవ్రంగా పడిపోయినప్పుడు వైద్యుల మార్గదర్శకత్వంలో డెక్స్ట్రోస్ చికిత్స కూడా అందిస్తారు.

స్పృహలో ఉంటేనే గ్లూకోజ్ ఇవ్వాలి

చక్కెర స్థాయిలు పడిపోయినట్లు అనుమానం వచ్చినప్పుడు బాధితుడు స్పృహలో ఉండి, సురక్షితంగా మింగగలిగితే ప్రథమ చికిత్సగా సుమారు 30 గ్రాముల గ్లూకోజ్ పొడిని 100 మిల్లీలీటర్ల నీటిలో కలిపి ఇవ్వవచ్చు. అయితే బాధితుడు స్పృహ కోల్పోయినా లేదా మింగలేని స్థితిలో ఉన్నా నోటిద్వారా నీరు, ఆహారం, గ్లూకోజ్ ఇవ్వకూడదు. వెంటనే 108కు సమాచారం అందించి వైద్య సహాయం పొందాలి.

నియంత్రణతోనే ఆరోగ్యకర జీవనం

మధుమేహం ఉందంటే భయపడాల్సిన అవసరం లేదని, కానీ నిర్లక్ష్యం మాత్రం ప్రమాదకరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, మందులు సక్రమంగా వాడటం, సమతుల్య ఆహారం తీసుకోవడం, తగిన వ్యాయామం చేయడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఇంటి వద్దే చికిత్స చేసేందుకు ప్రయత్నించకుండా 108 సేవలను వినియోగించుకోవాలని 108--EMRI సంస్థ ప్రజలకు సూచిస్తోంది.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట!

సూర్యాపేట, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):




వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించడంతో పాటు వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు చర్యలు చేపడుతోందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కందిబండ నరసింహారావు తెలిపారు. వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సయోధ్య డేకేర్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.వృద్ధులకు పింఛన్లు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వయోవృద్ధుల హక్కులకు రక్షణ కల్పించి, వారి జీవితాలకు భద్రత కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం--2007" ప్రకారం వయోవృద్ధుల హక్కులు, పోషణ, సంరక్షణకు చట్టపరమైన రక్షణ కల్పించబడిందని వివరించారు. ఈ చట్టానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం కూడా వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.సయోధ్య డేకేర్ సెంటర్ ఇన్‌చార్జి, కవి, గాయకుడు గొడ్డలి నరసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు ఇరిగి కోటేశ్వరి మాట్లాడుతూ.. వృద్ధుల సంక్షేమం సమాజ సంస్కారానికి నిదర్శనమన్నారు. పిల్లల పెంపకంలో చిన్నప్పటి నుంచే విలువలు నేర్పించాలని సూచించారు. వృద్ధులు తమ జీవితానుభవాలతో సమాజానికి విజ్ఞాన భాండాగారాలుగా నిలుస్తారని, వారిని గౌరవించి ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.సయోధ్య డేకేర్ సెంటర్ వ్యవస్థాపక చైర్మన్ సుమబాల మాట్లాడుతూ.. కన్నవారిని కాపాడుకోవడం కన్నబిడ్డల బాధ్యతని, వృద్ధులను ఆదరించడం సమాజ ధర్మమని అన్నారు. జీవితాంతం కుటుంబం కోసం శ్రమించిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఆప్యాయత, ఆదరణకు దూరం కావడం బాధాకరమన్నారు. వారికి కన్నీరు కాకుండా ప్రేమాభిమానాలు, ఆత్మీయతను అందించాలని కోరారు. వృద్ధుల జీవితాలకు భరోసా కల్పించేందుకు సయోధ్య కేంద్రం తన వంతు కృషి చేస్తోందని తెలిపారు.వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కవి, రచయిత అమిద్ ఖాన్ మాట్లాడుతూ.. వృద్ధులకు ఆరోగ్య, ఆర్థిక, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వారి సమగ్ర సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు.గోల్డ్ మెడలిస్ట్, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కృష్ణ బంటు మాట్లాడుతూ.. వృద్ధులకు కావాల్సింది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ప్రేమతో కూడిన కుటుంబ ఆదరణ కూడా అవసరమని అన్నారు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని, వారికి అండగా నిలవడం ప్రతి సంతానం బాధ్యతని పేర్కొన్నారు. వృద్ధులు తమ అనుభవాలతో కుటుంబాలను తీర్చిదిద్దే మార్గదర్శకులని, వారి సంక్షేమం దేశ అభ్యున్నతికి కూడా ఒక కొలమానమని వివరించారు. ఆధునిక సమాజంలో ఆర్థిక సంబంధాలకే ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో మానవ సంబంధాలు, ఆత్మీయత, అనురాగం, నైతిక విలువలను కాపాడుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల కృష్ణారెడ్డి, కార్యదర్శులు యాదగిరి, మద్ది ఉపేందర్ రెడ్డి, సయోధ్య సెంటర్ మేనేజర్ సూరం రేణుక తదితరులు ప్రసంగించారు. గొడ్డలి నరసన్న ఆలపించిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.సయోధ్య డేకేర్ సెంటర్‌లో సహజంగా లభించే ఆకులతో వృద్ధులు విస్తరాకులు తయారు చేస్తున్నారని నరసన్న తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహజ సిద్ధమైన విస్తరాకులను వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా అతిథులను శాలువాలతో సన్మానించారు. దాతలు జాన్ సుందర్, రాము, సంతోష్, రవి తదితరుల సహకారంతో కార్యక్రమానికి హాజరైన వారికి భోజన వసతి కల్పించారు.

పోలీస్ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

నాగర్‌కర్నూల్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

పోలీస్ సిబ్బంది ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లాలో పోలీస్ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం తుడుకుర్తిలోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు.ఎంటీఓ రాఘవరావు, ఏఎంటీఓ గౌస్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య నిపుణులు పోలీస్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేసి, కంటి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. వాహనాలను సురక్షితంగా నడపడానికి స్పష్టమైన కంటిచూపు ఎంతో అవసరమని, డ్రైవర్లు నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లాలోని పోలీస్ వాహనాల డ్రైవర్లందరూ తరచూ ఆరోగ్య, కంటి పరీక్షలు చేయించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.





లట్టుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



బిజినపల్లి, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం లట్టుపల్లి గ్రామంలోని ఊరగడ్డ ప్రాంతంలో రాగణమోని లలిత--యాదయ్య దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మారేపల్లి శివలీల చంద్రగౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ గడ్డం రామచంద్రయ్య, వార్డు సభ్యులు తిమ్మక్క, సునీత, తిరుపతయ్య, షేర్‌పల్లి శ్రీనివాస్ యాదవ్, సంతోష్‌రెడ్డి, శ్రీశైలం, పంతుల మహేష్, గడ్డం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కారుకొండ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు!

బిజినపల్లి, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏడో తరగతి విద్యార్థి ఎం.డి. సుభహాన్ నెహ్రూ వేషధారణలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నాడు. నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, స్వతంత్ర భారతదేశానికి తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 17 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సూర్యాపేటలో రూ.25 లక్షల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్!

ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా.. ఇన్నోవాలో 112 కిలోల గంజాయి స్వాధీనం

పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ఎస్కార్ట్‌గా మరో కారు.. పరారీలో ముగ్గురు నిందితులు

సూర్యాపేట, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును సూర్యాపేట పోలీసులు రట్టు చేశారు. జాతీయ రహదారి 65పై అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన ఇన్నోవా కారును తనిఖీ చేయగా 112 కిలోల గంజాయి బయటపడింది. సుమారు రూ. 25 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఒడిశాలోని జగన్నాథపురి ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కిలో రూ.2,000 చొప్పున 112 కిలోల గంజాయిని రూ.2.24 లక్షలకు కొనుగోలు చేశారు.

పోలీసుల కళ్లుగప్పేందుకు ఎస్కార్ట్ కారు

గంజాయిని 41 ప్యాకెట్లుగా తయారు చేసి ఇన్నోవా కారులో నింపి మహారాష్ట్రకు బయలుదేరారు. పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మరో ఎర్టిగా కారును ముందుగా ఎస్కార్ట్‌గా నడిపించారు. పోలీసుల కదలికలను గమనిస్తూ వెనుక వస్తున్న ఇన్నోవా వాహనానికి సమాచారం అందించేలా పథకం రూపొందించారు.ఈ క్రమంలో నవంబర్ 7న సూర్యాపేట పట్టణ శివారులోని జాతీయ రహదారి 65పై పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో ఇన్నోవా కారు అకస్మాత్తుగా బ్రేక్‌డౌన్ అయింది. దీంతో నిందితులు కారును రహదారి పక్కన వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు.

వాహనం కోసం తిరిగి వచ్చి పోలీసులకు చిక్కారు

అనుమానాస్పదంగా కారు నిలిపి ఉన్నట్లు సమాచారం అందడంతో సూర్యాపేట రెండో పట్టణ ఎస్సైలు కె. గోపికృష్ణ, బి. రామచంద్రం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. కారును తనిఖీ చేయగా 41 ప్యాకెట్లలో ఉన్న 112 కిలోల గంజాయి బయటపడింది. పంచుల సమక్షంలో గంజాయితో పాటు ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.దర్యాప్తులో భాగంగా వాహనాన్ని తిరిగి తీసుకెళ్లేందుకు నవంబర్ 12న సూర్యాపేటకు వచ్చిన ఇద్దరు నిందితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు.



అరెస్టయిన నిందితులు వీరే..

1. ఆకాష్ విజయ్ దాబేకర్ (23), బీడ్ జిల్లా, మహారాష్ట్ర.
2. ఆకాష్ దిలీప్ మోరే (32), బుల్దానా జిల్లా, మహారాష్ట్ర.

వీరి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి.

గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై జిల్లాలో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని ఎస్పీ కె. నరసింహ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యంతో పాటు వారి కుటుంబాలు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. గంజాయి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి రవాణా లేదా విక్రయాల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు

ఈ కేసును ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన పట్టణ సీఐ వెంకటయ్య, రెండో పట్టణ ఎస్సైలు కె. గోపికృష్ణ, రామచందర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు కొండా రమేష్, ఎన్. నవీన్‌లను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ వెంకటయ్య, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పరిరక్షణకు కార్మిక సంఘాల వినతి

నాగర్‌కర్నూల్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):



భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిని కొనసాగిస్తూ కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని కోరుతూ తెలంగాణ భవన మరియు నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంక్షేమ మండలి ప్రయోజనాలను ఇందిరమ్మ బీమాతో ముడిపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మారేడు శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాంగట్ల వెంకటస్వామి మాట్లాడుతూ.. అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలు నిరంతరంగా కొనసాగించాలని కోరారు. మండలి నిధుల వినియోగం, కార్మికులకు అందుతున్న సేవలు, ఆర్థిక సహాయం పంపిణీ విధానంపై కార్మికులకు స్పష్టత కల్పించాలని సూచించారు.సహజ, ప్రమాద మరణాలకు సంబంధించిన ఆర్థిక సహాయం విషయంలో ప్రైవేటు బీమా సంస్థలతో ఉన్న ఒప్పందం జూలై 26తో ముగిసిందని, ఈ నేపథ్యంలో పరిహారం కోసం ఎదురుచూస్తున్న కార్మిక కుటుంబాలకు సహాయం అందించే ప్రక్రియను ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. ఇందిరమ్మ బీమా పథకంలో కార్మికులను చేర్చే ప్రతిపాదన ఉన్నప్పటికీ, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా అమలయ్యే ప్రత్యేక ప్రయోజనాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఆధార్ వివరాల నవీకరణ, పేర్ల సవరణ వంటి ప్రక్రియలను సులభతరం చేసి ఆర్థిక సహాయం మంజూరులో జాప్యం లేకుండా చూడాలని కోరారు. మీ సేవ కేంద్రాల్లో కార్మికులకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో ఖాళీగా ఉన్న సహాయ కార్మిక అధికారి, జిల్లా కార్మిక అధికారి పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులు పని కూడళ్ల వద్ద విశ్రాంతి తీసుకునేందుకు నీడ సౌకర్యాలు కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య కార్డులు జారీ చేయాలని, 50 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.5 వేల భృతి అందించాలని, సాధారణ సేవా కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల విధానంపై పునఃపరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ మండలిలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని, సంక్షేమ మండలి పరిరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా తదుపరి కార్యక్రమాలు చేపడతామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డొక్కా లక్ష్మయ్య మేస్త్రి, జెట్టి బాలస్వామి, ఈర్ల భూపేష్, గొర్ల సత్యం, ఈర్ల హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, కార్మిక సంఘం నాయకులు కల్పన, మల్లేష్, ఆర్. రవి తదితరులతో పాటు మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 117 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన

33 కొత్త కేంద్రాల ఏర్పాటు.. 66,922 మంది పట్టభద్ర ఓటర్లకు సౌకర్యం: అదనపు కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ, నవంబర్ 14(ప్రజానేస్తం జ్వాల):

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం హనుమకొండ జిల్లాలో 117 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు అదనపు కలెక్టర్ ఎన్. రవి వెల్లడించారు. వీటిలో 84 పాత పోలింగ్ కేంద్రాలు కాగా, ఓటర్ల సౌకర్యార్థం మరో 33 కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే ఆరు పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను మార్చడంతో పాటు, మరో పది కేంద్రాల పేర్లను మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల ద్వారా జిల్లాలోని 66,922 మంది పట్టభద్ర ఓటర్లకు ఓటు వేసే సౌకర్యం కల్పించనున్నట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

వజినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో రేపు విద్యుత్ అంతరాయం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

33/11 కేవీ వజినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం (నవంబర్ 14) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ అంతరాయం వల్ల గొర్లవీడు, వజినేపల్లి, నేరేడుపల్లి గ్రామాలతో పాటు సదరు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.



రబీలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి!

- **ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలి**
- **ధాన్యం కొనుగోళ్లలో రైతులకు మద్దతు ధర, బోనస్ అందేలా చూడాలి.. కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు**

సూర్యాపేట, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

రబీ 2026--27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు, సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అంశాలపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలి

ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున రైతులను వరి సాగుకు బదులుగా పండ్లు, కూరగాయలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని సీఎస్ సూచించారు. పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, రాయితీలపై రైతులకు విస్తృతంగా వివరించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం జరగకూడదు



ప్రైవేటు మార్కెట్లలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సంజయ్ జాజు సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు.అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, రైతుల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఇతర అంశాలపై సమీక్షవిద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా పర్యవేక్షించి పాఠశాలల్లో విద్యార్థుల హాజరును 90 శాతానికి పెంచాలని సీఎస్ సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని, వీధి కుక్కల నియంత్రణకు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వి.బి.జి. రామ్‌జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజు, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ అధికారి యాదగిరి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

నాగర్‌కర్నూల్, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలోని అన్ని శాఖల పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. చేపడుతున్న పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా సాధించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు నమోదుకు ముఖ గుర్తింపు విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ అవకాశాలు కల్పించి, వారిలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని అన్నారు.జాతీయ రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణ, అటవీ అనుమతులు, విద్యుత్ లైన్ల మార్పిడి వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రహదారి పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.వ్యవసాయ రంగంలో జిల్లాలో 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, మరో 2,500 ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



రైతులకు ఏఐ ఆధారిత వ్యవసాయ సలహాలు..

'భారత్ విస్తార్' సేవలకు తెలంగాణ ఒప్పందం

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):



రాష్ట్రంలోని రైతులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా తెలుగులోనే సమగ్ర వ్యవసాయ సలహాలు అందించేందుకు తెలంగాణ వ్యవసాయ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ (ఎన్ఐఎస్‌జీ) మధ్య ఒప్పందం కుదిరింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'భారత్ విస్తార్' డిజిటల్ వేదిక ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ సమాచారాన్ని సులభంగా అందించనున్నారు.ఈ వేదిక ద్వారా పంటల సాగు విధానాలు, వాతావరణ హెచ్చరికలు, చీడపీడలు, తెగుళ్ల నివారణ చర్యలు, ఎరువుల వినియోగం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను రైతులు తమకు అర్థమయ్యే తెలుగులో తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సేవలను రైతులకు చేరువ చేసేందుకు 155261 హెల్ప్‌లైన్ నంబర్‌తో పాటు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్, వాట్సాప్ చాట్‌బాట్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటి ద్వారా రైతులు తమ వ్యవసాయ సమస్యలకు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ సేవలు అందుబాటులోకి వస్తే రైతులకు సకాలంలో సాంకేతిక సమాచారం చేరడంతో పాటు వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగపడనున్నాయి.

పీజీ మెడికల్ ప్రవేశాలకు తొలి విడత వెబ్ ఆప్షన్ల నోటిఫికేషన్ విడుదల

- **నవంబర్ 15 మధ్యాహ్నం 2 గంటల వరకు అవకాశం.. కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ ప్రకటన**

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):



2026--27 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ డిగ్రీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబర్ 13 మధ్యాహ్నం 2 గంటల నుంచి నవంబర్ 15 మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని విశ్వవిద్యాలయ అధికారులు సూచించారు. అభ్యర్థులు కోర్సులు, కళాశాలల ఎంపికకు సంబంధించిన ఆప్షన్లను గడువులోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ knruhs.telangana.gov.inqT, వెబ్ ఆప్షన్ల నమోదు కోసం tspgmed.tsche.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):



పోలీస్ శాఖలో పరిపాలనాపరమైన మార్పుల్లో భాగంగా పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీలు, పోస్టింగ్‌లలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఐజీపీ సంపత్ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలోని బోర్డు సిఫార్సుల మేరకు ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కాసగాని శ్రీధర్‌ను ములుగు జిల్లా వెంకటాపురం సర్కిల్‌కు బదిలీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ముత్యం రమేష్‌ను మల్టీజోన్-1 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు ఖమ్మం సీసీఆర్‌బీ, సీటీసీ విభాగాలకు పోస్టింగ్‌లు కల్పించిన బొమ్మెర బాలకృష్ణ, రాడం భానుప్రకాశ్‌ల పోస్టింగ్‌లను రద్దు చేశారు. వారిని వెయిటింగ్‌లో ఉంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):



రబీ 2026--27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సమీక్ష

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో రబీ సాగు ప్రణాళికలు, విద్యా రంగం, విద్యాసంస్థల నిర్మాణాలు, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనుల పురోగతిపై సమీక్షించారు. రబీ సీజన్‌లో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా పంటల ప్రణాళిక రూపొందించాలని, వరికి బదులుగా ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వాటి వినియోగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థుల హాజరును 90 శాతానికి పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు. విద్యాసంస్థల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచినందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను సీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

రెగ్యులరైజేషన్ కోసం కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల చాక్‌డౌన్

- **రిజిస్ట్రార్‌కు వినతిపత్రం.. యూజీసీ పే స్కేల్‌తో ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్**

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):



తమ సేవలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ (కేయూ) కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చాక్‌డౌన్ నిరసన చేపట్టారు. రెగ్యులర్ నియామకాలు చేపట్టే ముందే తమ సమస్యను పరిష్కరించి, సేవలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.నిరసన అనంతరం కాంట్రాక్ట్ అధ్యాపకులు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు అనుగుణంగా పే స్కేల్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించి న్యాయం చేయకుంటే జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నేతలు హెచ్చరించారు.

హనుమకొండలో నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- **నూతన ఆడిటోరియం, రీడింగ్ హాల్ ప్రారంభం.. నవంబర్ 20 వరకు వేడుకలు**

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్యదర్శి సరిత ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నూతన వసతులకు ప్రారంభోత్సవం

వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియం, రీడింగ్ హాల్‌ను ప్రారంభించనున్నారు. పాఠకులు, విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.వారం రోజుల పాటు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అజీజ్ ఖాన్, సరిత కోరారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాదం.. ఒకే రోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. పంట నష్టాలు, అప్పుల భారం కారణంగా ఒకే రోజు ముగ్గురు రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనలు ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.నల్లబెల్లి మండలం బుజ్జు తండాకు చెందిన జర్పుల వెంకటేష్ (27) రెండెకరాల్లో పత్తి సాగు చేయగా ఆశించిన దిగుబడి రాకపోవడంతో మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.నర్మెట మండలం ఆగాపేటకు చెందిన మెట్ల ఉప్పలమ్మ (50) పత్తి పంట నష్టపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా వెంకట్రామ్ తండాకు చెందిన బానోతు రాములు (58) రెండెకరాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలకు ఆశించిన దిగుబడి రాకపోవడంతో పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నట్లు తెలిసింది.ఒకే రోజు ముగ్గురు రైతులు మృతి చెందడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. పంట నష్టాలు, అప్పుల సమస్యలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.



రుణగ్రహీతలకు వడ్డీ రేట్ల పెంపు భయం.. రెపో రేటుపై ఆర్బీఐ నిర్ణయంపై ఉత్కంఠ

- **డిసెంబర్ 2 నుంచి 4 వరకు ఎంపీసీ సమావేశం.. మరోసారి పెరిగితే ఈఎంఐల భారం అధికమయ్యే అవకాశం**

హనుమకొండ, నవంబర్ 14 (ప్రజానేస్తం జ్వాల):




రుణగ్రహీతలకు మరోసారి వడ్డీ రేట్ల పెంపు భయం వెంటాడుతోంది. అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం రెండేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) మరోసారి రెపో రేటును పెంచే అవకాశాలున్నాయని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనుంది.

0.25 నుంచి 0.50 శాతం పెంపుపై అంచనాలు

తాజా సమావేశంలో రెపో రేటును 0.25 శాతం నుంచి 0.50 శాతం వరకు పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత నెలలోనే ఆర్బీఐ రెపో రేటును 0.25 శాతం పెంచి 5.50 శాతానికి చేర్చినట్లు సమాచారం. మరోసారి వడ్డీ రేట్లు పెరిగితే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారిపై ఈఎంఐల భారం మరింత పెరిగే అవకాశం ఉంది. రెపో రేటులో మార్పులు బ్యాంకుల రుణ వడ్డీ రేట్లపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో సామాన్య రుణగ్రహీతలు ఆర్బీఐ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే రెపో రేటుపై తుది నిర్ణయం ఎంపీసీ సమావేశం అనంతరం వెల్లడికానుంది.

భూపాలపల్లిలో అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):



భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కోచింగ్ సెంటర్--స్టడీ సర్కిల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ ఎజఖ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాన్ని కూడా ఎమ్మెల్యేకు అందించారు.ఈ సందర్భంగా అంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు ఇతర బహుజన పేద విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు నాణ్యమైన ఉచిత కోచింగ్ సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ పొందలేక ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కోచింగ్ సెంటర్--స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఉచితంగా పోటీ పరీక్షల శిక్షణతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్, గ్రంథాలయ సౌకర్యం, ప్రశాంతమైన అధ్యయన వాతావరణం అందుబాటులోకి వస్తాయని వివరించారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని విశ్వసించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు.దీనిపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందిస్తూ విద్యార్థుల సమస్యలను పరిశీలించి, అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు అంబాల అనిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేకు ఎజఖ యూత్ నాయకులు, విద్యార్థి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎజఖ యూత్, విద్యార్థి నాయకులు జీడి జితేందర్, బూడిద నాగరాజు, భాస్కర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు ప్రాణహాని కలిగించే కుట్రలను సహించేది లేదు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపడుతున్న బీసీ రాజ్యాధికార పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు రాజకీయ శక్తులు ఆయనపై దాడులకు కుట్రలు చేస్తున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తీవ్ర ఆరోపణలు చేశారు.నేటి పాదయాత్ర సందర్భంగా తీన్మార్ మల్లన్న ప్రయాణిస్తున్న ఫార్చునర్ వాహనాన్ని లారీతో ఢీకొట్టేందుకు ప్రయత్నం జరిగిందనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గతంలో బెల్లి లలిత, మారోజు వీరన్న, సాంబశివుడు, ఎర్ర సత్యం వంటి పలువురు ఉద్యమకారులు సామాజిక న్యాయం, తెలంగాణ హక్కుల కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలను ఈ సందర్భంగా రవి పటేల్ గుర్తుచేశారు. ప్రస్తుతం బీసీల రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తున్న తీన్మార్ మల్లన్నకు కూడా ముప్పు పొంచి ఉందనే అనుమానాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.51 రోజులుగా నిర్విరామంగా వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ బీసీల విద్య, వైద్యం, ఉద్యోగాలు, రాజకీయ వాటా, సామాజిక న్యాయం కోసం మల్లన్న పోరాడుతున్నారని తెలిపారు. బెదిరింపులతో ఈ ఉద్యమాన్ని ఆపలేరని, ఇప్పటికే ఈ పోరాటం ప్రజా ఉద్యమంగా మారిందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని రవి పటేల్ పిలుపునిచ్చారు. భావితరాల భవిష్యత్తు కోసం విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ అధికారంలో తగిన వాటా సాధించేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని కోరారు.ఈ ఘటనను తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండించాలని, రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ డీజీపీ తక్షణమే స్పందించి తీన్మార్ మల్లన్నకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలని, ఆయన ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.తీన్మార్ మల్లన్నకు ఏదైనా హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవి పటేల్ హెచ్చరించారు. బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని బెదిరింపులతో అణచివేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వాహనాన్ని ఢీకొట్టే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.రాష్ట్రంలో మరో భారీ బీసీ ఉద్యమానికి ఈ ఘటన కారణం కాకముందే ప్రభుత్వం అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని, బీసీ రాజ్యాధికార సాధన కోసం ప్రజలందరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, అధికార ప్రతినిధి మడే సంతోష్, కోశాధికారి జినుకల శ్రీను, జిల్లా కోఆర్డినేటర్ మోటపోతుల సమ్మయ్య, జిల్లా నాయకులు జిలకల అశోక్, గట్టు శ్రీకాంత్, రోడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత

ఐనవోలు, నవంబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ శుక్రవారం ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆమెకు పోలీస్ అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలకగా, సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ కొబ్బరి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను చాటారు.

రికార్డుల పరిశీలన.. సిబ్బందికి దిశానిర్దేశం

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, రిజిస్టర్లను సీపీ క్షుణ్ణంగా పరిశీలించి వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీసు సిబ్బంది విధులు, బాధ్యతలు, పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, బాధితులకు న్యాయం జరిగేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన పోలీస్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలి

ఐనవోలులోని ప్రసిద్ధ శ్రీ మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీపీ సూచించారు. భక్తుల మనోభావాలు, ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడాలని తెలిపారు.అలాగే పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ సంతోష్, ఐనవోలు ఎస్ఐ అశోక్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, పర్వతగిరి ఎస్ఐ రాజ్‌కుమార్‌తో పాటు ఐనవోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

